దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరేందుకు అర్హత గల యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న పలు అగ్రశ్రేణి కంపెనీల్లో 12 నెలల పాటు ఇంటర్న్ షిప్ నిర్వహించి పరిశ్రమల్లో అనుభవం కల్పించనున్నట్టు తెలిపారు. ఎంపికైన వారికి సింగిల్ గ్రాంటు రూ.6 వేలు, ప్రతినెలా రూ 5 వేలు వంతున ఏడాది పాటు అందజేస్తావమన్నారు. వీటితో పాటు పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్షా బీమా యోజన బీమా సదుపాయం కలిపిస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 21లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కమాండ్ కంట్రోల్ ఫోన్ నంబర్లు 9988853335, 8712655686, 8790118349, 9553228843కు సంప్రదించాలన్నారు. దరఖాస్తు దారులు నమోదు చేసుకునేందుకు https://pminternship.mca.gov.in/login వెబ్‌సైట్లో పరిశీలించాలని సూచించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పాడి పరిశ్రమా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని రేగులపాడులో రూ.2.30 లక్షలతో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన మినీ గోకులం (గోశాల)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని రోడ్లు, ఉద్యాన పంటల పెంపకం, రైతులకు నేరుగా చెల్లింపులు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసిందని, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. చాలాచోట్ల ధ్వంసమైన రోడ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఉద్యాన పంటలు అధిక దిగుబడులు ఇస్తాయని, రైతులు ఆ దిశగా ఆలోచన చేయాలని చెప్పారు. లింగాలపాడుకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసి పంటలకు నీరు అందించేందుకు కృషి చేశామన్నారు. దేశంలోనే మరెక్కడలేని విధంగా రూ. 4 వేలు పింఛను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల నిర్వాణ బాధ్యతలు ప్రయివేటు యాజమాన్యాలకు అప్పగిస్తున్నామని, తద్వారా ప్రతి ఎకరాకూ సాగునీరు అందుతుందని అన్నారు. కార్యక్రమం లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్‌పి రామారావు, పిఎసిఎస్ మాజీ సభ్యులు కింజరాపు హరివరప్రసాద్, పశు సంవర్ధక సంయుక్త సంచాలకులు మురళీధర్, రేగులపాడు సర్పంచ్ ప్రభాకర్, ఎంపిడిఒ ఫణీంద్రరావు, ఎపిఒ హరిప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే గౌతు శిరీష
- 41 రాష్ట్ర టెన్నికాయట్ పోటీలు ప్రారంభం

క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం 41 రాష్ట్ర టెన్నికాయట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. జిల్లా కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. గతంలో క్రీడలకు ఎటువంటి ప్రోత్సాహం ఉండేది కాదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చదువులతో పాటు క్రీడలు ఆడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత క్రీడల్లో పురుషులతో సమానంగా బాలికలు పాల్గొనడంపై వారికి తగురీతిలో ప్రోత్సాహం అందిస్తామన్నారు. పలాస క్రీడామైదానంలో ఏ క్రీడలు నిర్వహించినా విజయవంతం అవుతాయని, ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో అనేక బంగారు పతకాలు సాధించారని గుర్తు చేశారు. అంతకుముందు క్రీడా, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభించారు. రెండు రోజుల పాటు వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు తమ క్రీడా ప్రదర్శన ఇవ్వనున్నారు. విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేపట్టి చేసిన విన్యాసాలు ఆకట్టుకోగా, విద్యార్థుల కోలాటం ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. క్రీడా నిర్వాహకులు పి.తవిటయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, కొరికాన శంకర్, డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య, పిఇటిలు శేఖర్‌బాబు, హరి, పద్మలోచనరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీ

పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు హెూరాహెూరీగా సాగుతున్నాయి. రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు పది జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజయనగరం, విశాఖ పట్నం జిల్లాల మధ్య పోటీ నిర్వహించగా, విశాఖపట్నం జిల్లా నుంచి జె.సంతోష్ విజయం సాధించారు. శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లా మధ్య పోటీ నిర్వహించగా, జిల్లాకు చెందిన బి.జగదీష్ బెహరా, ఉదయ్ కిరణ్ విజయం సాధించారు. కార్యక్రమంలో కె.ఎన్.వి.సత్యనారాయణ, తవిటయ్య, హరిబాబు, పద్మలోచన, జి.రాజు, కె.రమేష్, జి.కానకరావు, అబ్దుల్ రెహమాన్, నాగరాజు, అలేఖ్య, రామారావు, వినయ్, సంతోష్, చిరంజీవి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలోని ప్రతి రైతుల దగ్గర నుంచి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నతాధికారులతో శనివారం ఫోన్‌లో మాట్లాడారు. సాంకేతిక సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అవసరమైన ట్రాక్ షీట్లు అందించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. రైతు ఇంట పండగ వాతావరణం కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. రైతు ధాన్యం అమ్మిన నాలుగు గంటల్లోనే వారి ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు వచ్చాయి. నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయని, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే నిమ్మాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వి.బాలమురళి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కింజరాపు హరివర ప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషు పాల్గొన్నారు.

త్వరితగతిన నూతన కలెక్టరేట్ పనులు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కలెక్టరేట్‌లో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. భవన సముదాయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టరుతో కలిసి శనివారం పరిశీలించారు. నూతన కలెక్టరెట్ ఆవరణలో పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ నిర్మాణం తదితర పనులపై ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్‌ను ఆయన ప్రశ్నించారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు రాజీలేదని, నిర్ధేశించిన మేరకు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఇప్పటికే భవనంలో కొన్ని విభాగాలకు కేటాయించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఇ వివరించారు. పూర్తి స్థాయిలో పనులను వివరించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్థులో ప్రతి గదిని పరిశీలించారు. మ్యాప్‌లో నిర్ధేశించిన మేరకు నిర్మించాలన్నారు. భవనానికి ముందు భాగంగా చుట్టూ రోడ్లు నిర్మించాలన్నారు. అలాగే విశాలమైన ప్రాంగణం రూపుదిద్దుకోవాలన్నారు. ఈపరిశీలనలో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, ఎఒ సూర్యనారాయణ, కాంట్రాక్టరు తరపున సైట్ ఇన్‌ఛార్జి ప్రసాదరావు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు నివాళి

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వడ్డే ఓబన్న అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. శనివారం ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, బిసి సంక్షేమాధికారి బి.అనురాధ, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

టెండర్ల వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

రథసప్తమి వేడుకల నిర్వహణకు టెండర్లు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల నిర్వహణలో భాగంగా వివిధ ఏర్పాట్లకు సంబంధించిన పనులకు శనివారం టెండర్లు నిర్వహించారు. షీల్డ్ టెండర్ల కం వేలం ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపట్టారు. దేవస్థానం, అరసవల్లి విద్యుత్ దీపాలంకరణ పాటలో తగ్గింపు పాటదారుడు ఉంగటి పాపారావు రూ.22,90,000లకు దక్కించుకున్నారు. క్యూలైన్ల ఏర్పాట్లకు సంబంధించి తగ్గింపు పాటదారునిగా పిల్లా మౌళి రూ.3,19, 000లకు దక్కించుకున్నారు. షామియానాలు, కార్పెట్లు వేసేందుకు నిర్వహించిన టెండర్లు వాయిదా పడ్డాయి. ఆలయానికి రంగులు వేసేందుకు డి.రాజారావు రూ.1,80,000 పనులు దక్కించుకున్నారు. అలాగే ఫొటోలు, వీడియో, ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేయడం, టీ, టిఫిన్, భోజనాలకు సంప్రదింపులు చేపట్టారు. సిసి కెమెరాల ఏర్పాటుకు పాటదారులు రాకపోవడంతో వాయిదా వేశారు. ఆలయ ఇఒ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, శ్రీకూర్మం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.గురునాథం పాల్గొన్నారు.

వంశధార భూసేకరణ అధికారిగా జయదేవి

శ్రీకాకుళం ప్రతినిధి: బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు భూ సేకరణ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా జి. జయదేవి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు స్పెషల్ డిప్యూటీ కలెకర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం జిఒ విడుదల చేసింది. ప్రస్తుతం ఆమె విశాఖ జిల్లా ఐసిడిఎస్ పీడీగా పనిచేస్తున్నారు. గతంలో ఈమె జిల్లాలోనూ ఐసిడిఎస్ పీడీగా పనిచేశారు. భూ సేకరణ యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

రోజాపై విచారణ చేపట్టాలి

ఆమదాలవలస: వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సినీనటి ఆర్.కె రోజా రూ.100 కోట్ల తిరుపతి దేవస్థానం దర్శన బ్లాక్‌టికెట్ల వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడు తూ ఇటీవల తిరుపతిలో వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల క్యూలైన్‌లో అనుకోకుండా జరిగిన సంఘటనను వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేయటం సిగ్గుచేటన్నారు. సంఘటన జరిగిన వెంటనే సిఎం చంద్రబాబు, మంత్రుల బృందం బాధిత కుటుంబాలను పరామర్శించారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, ఎండ అప్పలనాయుడు, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాగావళి కాలుష్యంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న జెవివి సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నాగావళి నదిలో జల కాలుష్యాన్ని శనివారం పరిశీలించారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం, కొత్త బ్రిడ్జి మధ్య మురుగునీరు విడిచి పెడుతున్నారని, దీనివల్ల నదీ జలాలు కలుషిత మవుతున్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. పాత వంతెన వద్ద పెద్దఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నది జలాలు కలుషితం అవుతున్న తీరును పరిశీలించారు. అనంతరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ నగరంలోని మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు నదీ జలాల్లోకి చేరకుండా నగరపాలక సంస్థ చర్యలు చేపట్టాలని కోరారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంటను ఏర్పాటు చేయాలని, శుద్ధి అనంతరం నదిలోకి విడిచిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, పర్యావరణ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు, విద్య సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, వాసుదేవరావు, పి.జగదీశ్వరరావు, చమళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

54 మందితో వైసిపి జిల్లా కార్యవర్గం

పద్మావతి | కోటబొమ్మాళి | మోహనరావు | వెంకటరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి జిల్లా కార్యవర్గాన్ని 54 మందితో పార్టీ అధిష్టానం ప్రకటించింది. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా గేదెల పురుషోత్తం, ఎ.వి.సురేష్, తిండా ప్రసాదరావు, కురమాన బాలకృష్ణ, సనపల నారాయణరావు, కోటబొమ్మాళి మండలానికి చెందిన పొన్నాన మోహనరావులను నియమించారు. అలాగే ఉపాధ్యక్షులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఉర్లాన బాలరాజు, ఆర్.చిట్టిబాబు, కింజరాపు సురేష్, అన్నెపు రామారావు, బొౌతు సూర్యనారాయణ, బగ్గు రామకృష్ణ, పలాసకు చెందిన పైల వెంకటరావు (చిట్టి), ఇచ్ఛాపురానికి చెందిన రామపత్ని చిట్టిబాబులు నియమితులయ్యారు.

ట్రెజరర్‌గా తంగుడు నాగేశ్వరరావుకు అవకాశం దక్కింది. ఆర్గనైజింగ్ కార్యదర్శులకు 15 మందికి అవకాశం కల్పించారు. వీరితో పాటు సెక్రటరీ యాక్టివిస్టులుగా మరో 15 మందికి చోటు కల్పించారు. అలాగే అధికార ప్రతినిధులుగా శిమ్మ సాంబశివరావు, పూడి నేతాజి, కోనాడ నర్సింగరావు, కోట గోవిందరావు, సత్తారు సత్యం, పిల్లల శివకుమార్, కరిమి రాజేశ్వరరావు, బమ్మిడి ధుర్యోధనలకు చోటు కల్పించారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ఎమ్మెల్యే శంకర్

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఫిబ్రవరి 4న రథసప్తమి దృష్ట్యా వివిధ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకు సూచించారు. నగరంలోని అరసవల్లిలో అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించిన భవనాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండగా గుర్తించిందన్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే యాత్రికుల వాహనాలను పార్కింగ్ చేసే స్థలం, క్యూ లైన్లో వచ్చే యాత్రికులకు సాధారణ దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. యాత్రికులకు అందుబాటులో తాగునీరు, ప్రసాదాలు ఉంచాలని అధికారులకు చెప్పారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ కింజరాపు అచ్చెన్నాయుడు ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారని, వారి ఆలోచనలకు అనుగుణంగా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలిపారు. ఆలయ పరిసరాలను పోలీసులతో కలిపి పరిశీలించి ఎమ్మెల్యే పలు సూచనలు సలహాలు అందించారు. ఈయనతో పాటు ఆలయ ఇఒ భద్రాద్రి, డిఎస్‌పి వివేకానంద, సిఐ పైడపునాయుడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. అఖిలభారత రైతు కూలి సంఘం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన మెళియాపుట్టిలో శనివారం భారీ ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం తర్వాత దేశవ్యాప్తంగా ఆదివాసీలకు ఐటిడిఎ వచ్చిందన్నారు. జిల్లాల విభజన తరువాత జిల్లాకు ఐటిడిఎ లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జిల్లాల విభజన సమయంలో ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. ఇప్పుడు జిల్లా ఎనిమిది నియోజకవర్గాలతో ఏర్పడిందని, 16 మండలాల్లో ఆదివాసీలు ఉన్నారని అన్నారు. అలాగే ఐదు సబ్ ప్లాన్ మండలాలు ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలి సంఘం చేస్తున్న ఆందోళనకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలకు రూల్ ఆఫ్ రోస్టర్ ఆరు శాంతం ఉంటే అందులో కూడా దొంగ ధ్రువపత్రాలతో నాలుగు శాతం గిరిజనేతరులు ఉద్యోగాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ సమస్యలపై ప్రశ్నించడానికి జిల్లాలో ఎస్‌టి నియోజకవర్గం లేకపోవడం అన్యాయమన్నారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటుకు భౌగోళికంగా అన్ని విధాలుగా బాగుంటుందని అన్నారు. అనంతరం తహశీల్దార్ బడే పాపారావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, సర్పంచ్‌లు సవర వెంకటేష్, జమ్మయ్య, భాస్కరరావు, పాపారావు, గౌరేసు, జనార్ధన, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు గణేష్, శ్రీను, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి వినోద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఎఐఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, ఎస్ఎస్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను పరిరక్షించాలి

షీల్డ్‌ను అందజేస్తున్న కుమార్ నాయక్

పలాస : నాటి సంప్రదాయ కళలను పరిరక్షించి ముందు తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని విశ్రాంత ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య, కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. మండలంలోని రంగోయిలో గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం 21వ వార్షిక జానపద కళాజాతర సంబరాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ఈ సంస్థ ద్వారా కళాజాతర సంబరాలు నిర్వహిస్తుతం గొప్ప విషయమన్నారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ వివిధ కళారంగాల్లో నిష్ణాతులైన వారు ఈ కళాజాతర సంబరాల్లో పాల్గొని కళావిశిష్టతను ప్రదర్శించడం ఆనందదాయకమన్నారు. గౌరమ్మ, ఉబాలు, జముకులు, గంగిరెద్దుల పాటలు నేటి తరానికి తెలియాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాటలను ప్రదర్శించారు. తోటరమణమ్మ, తపాల మహాలక్ష్మి ఉడుపుల, గైరమ్మ పాటలు, ఒడిశా జంగాలపాడుకు చెందిన కళాకారులు జముకుల పాటలు, సింహాద్రి అప్పన్న డోల పాటలు, రేగులపాడు తప్పెటగుళ్ల బృందం నృత్య ప్రదర్శన చేశారు. గేదెల భీముడు ఎరుకుల పాటలు, పి.ధనుంజయరావు బుర్రకథ, భైరిసారంగపురం గంగిరెద్దులు, అనంతపురం జిల్లా వెంకటరమణ ఆధ్వర్యాన జానపద పాటలు, కూచిపూడి నాట్యం, కోలాటాలు, ఖిలాయ్యు చెందిన కె.చిరంజీవులు జానపద గీతాలు, మిమిక్రీ, రాజమండ్రి వారిచే పోతురాజు నాట్యం, మడ్డు తిరుపతిరావు గణితావధానం, దేవుడిపాటలు, మ్యాజిక్ అద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బద్రి కూర్మారావు, కళాకారులు కుమార్నాయక్, తెప్పల కృష్ణమూర్తి, డాక్టర్ కె.చిరంజీవులు పాల్గొన్నారు. అనంతరం జానప కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్ షీల్డ్‌ను అందజేశారు.

చి'వరి'లో చేతులెత్తేశారా?

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ధాన్యం కొనుగోలు విషయంలో పాలకుల మాటలకు అర్థాలే వేరులే అన్నట్లుగా ఉంది. చివరి గింజ వరకూ కొంటామని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నుంచి ఎమ్మెల్యే వరకు చెప్తే రైతులు నిజమనే నమ్మారు. ధాన్యం కొనుగోలుకు లక్ష్యమంటూ లేదని ఎంతైనా కొంటామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు నమ్మించారు. చివరిలో మాత్రం లక్ష్యమైపోయిందంటూ చేతులేత్తేశారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో జిల్లాలో 20 మండలాల్లో ధాన్యం కొనుగోలు ఆపేయడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అందరూ పండగ సంతోషంలో ఉంటే అన్నం పెట్టే అన్నదాత మోములో ఆ ఆనందఛాయలు కనిపించడం లేదు. చేతికందిన పంటను విక్రయించి కుటుంబంతో ఆనందంగా సంక్రాంతి నిర్వహించుకోవాలన్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్‌లో సంవత్సరం తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోను 5 లక్షల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావొచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్ని లెక్క గట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కొనుగోలుకు ముందు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లాలో రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై సమీక్ష తర్వాత లక్ష్యంలో ఏ మార్పు కనిపించలేదు.

అధికారులు తొలుత ఏది నిర్ణయించారో? ఆ మేరకే ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసి సేకరణ మొదలు పెట్టారు. జిల్లా లక్ష్యానికి అనుగుణంగా ఆయా మండలాలకు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో శ్రీకాకుళం, గార, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పలాస, మెళియాపుట్టి, జి.సిగడాం, సంతబొమ్మాళి, టెక్కలి, బూర్జ, కోటబొమ్మాళి, నందిగాం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, పోలాకి తదితర మండలాల్లో లక్ష్యం పూర్తయిందనే పేరుతో కొనుగోలు ఆపేశారు.

ధాన్యం కొనుగోలు కోసం ఏటా రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితిని పాలకులు కల్పిస్తున్నారు. ఏటా ఇదే సమస్య తలెత్తుతున్నా దాని పరిష్కారంపై ప్రభుత్వమూ దృష్టి సారించడం లేదు. గత సంవత్సరం రైతుల దగ్గర ధాన్యం నిల్వలు ఉంటుండగానే కొనుగోలు ఆపేశారు. మిల్లర్ల అసోసియేషన్ నాయకులు అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలవడంతో అయన పౌర సరఫరాల సంస్థ అధికారులకు ఫోన్ చేసి అదనంగా ధాన్యం కొనాలని రికమెండ్ చేశారు. మరోవైపు రైతుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో ప్రభుత్వం తొలి విడతలో కొంచెం, ఆ తర్వాత మరికొంత పరిమాణంలో కొసిరి కొసిరి కొనుగోలు చేసింది. ఇప్పుడు అదే పరిస్థితి వచ్చినా మంత్రి అచ్చెన్నాయుడు మాత్రం రైతులపై సానుకూలంగా స్పందించినట్లు కనిపించడం లేదు. ధాన్యం కొనుగోలు చేయమని చెప్పకుండా కేవలం సాంకేతిక సమస్యలు మాత్రమే పరిష్కరించాలని చెప్పినట్లు తెలిసింది. సాంకేతిక సమస్యలతో ధాన్యం కొనుగోలుకు ట్రక్ షీట్లు జనరేట్ కాకపోవడం సమస్యను జిల్లా అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారమైపోతుంది. అది పెద్ద సమస్య కాదు. ధాన్యం సేకరణ లక్ష్యం పెంచి రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయడం ఇప్పుడు అందరి ముందు ఉన్న తక్షణ కర్తవ్యం. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, పొందూరు, ఆమదాలవలస, జి.సిగడాం, గార తదితర మండలాల్లో ఆలస్యంగా నూర్పులు చేపట్టడంతో డిసెంబరు చివరి వారంలో పంట చేతికొస్తుంది.

తమ మండలాల రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొంత మంది ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ధాన్యాన్ని తమ మండలాలకు సర్దుబాటు చేయొద్దంటూ మరోవైపు కొందరు ఎమ్మెల్యేలు అధికారులకు చెప్తున్నారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో ఆపేసిన మండలాల్లో రైతుల వద్ద ఎంత మేర ధాన్యం నిల్వలు ఉంటే అంత పరిమాణంలో ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే దీనికి పరిష్కారం దొరుకుతుంది. ప్రభుత్వ నిర్ణయాల్లో భాగస్వామిగా ఉన్న వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచడం అమాత్యునికి పెద్ద సమస్య కాదు. జిల్లా రైతుల ప్రయోజనాల కోసం ఆయన మేరకు కృషి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- సోంపేట

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంగా చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపట్నం, గొల్లగండిలో ఉన్నత పాఠశాల ప్రహరీ, సిసి రోడ్లు, కమ్యూనిటీ భవనాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాసరి రాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, నీట్ల గోపాల్, సానా సన్యాసిరావు, జి.కె.నాయుడు, వెదుళ్ల హరికృష్ణ, మద్దు రాజారావు, రత్నాల బాబూరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండలంలోని చిన్న జొన్నవలస గ్రామానికి చెందిన ఇళ్ల కోల్పోయిన 16 మంది బాధితులకు మూడేసి సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాల్లో నూతనంగా ఇల్లు నిర్మించుకునేందుకు గృహ నిర్మాణ రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ నెల 5న మండలంలోని చిన్న జొన్నవలసలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మొదగుల చెరువు గట్టుపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారని బాధితులు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితులను పరామర్శించి ఇళ్ల పట్టాలను బాధితులకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు అన్నెపు భాస్కరరావు, గొర్లె సూర్యం, తహశీల్దార్ ఎస్.రాంబాబు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఆర్ఐ పప్పల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

పోలాకి: మండలంలో పలు గ్రామాలకు జరిపిన పనులు పూర్తి చేసిన బిటి రోడ్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ముందుగా రూ.1.20 కోట్లతో నిర్మించిన తోటాడ నుంచి గొల్లవలసలోని డిపిఎన్ రోడ్డును ప్రారంభించారు. నరసన్నపేట మండలంలో రూ.90 లక్షలతో నిర్మించిన చిక్కాలవలస నుంచి మామిడివలసకు, జగన్నాథపురం, తెలుగుపేట, కామేశ్వరినగర్, ముద్దాడ వీధి, కాళింగ వీధి రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పోలాకి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఎ.వెంకట అప్పలనాయుడు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, లుకలాపు రాంబాబు, పంచిరెడ్డి సింహాచలం, చిక్కాలవలస సర్పంచ్ ముంజి శ్రీరాములు, జల్లు చంద్రమౌళి, నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆదినాయుడు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ ప్రీమియర్ లీగ్-5 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచ్ తెంబురు ప్రసాదరావు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు కొనసాగుతుందని, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పి.రాజు, మోహనరావు, కోటి, అరుణ్, వసంత్, ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మవరంలో కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ధర్మవరంలో 'మేము సైతం' - స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి అండర్ -19 కబడ్డీ పోటీలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు ఎ.రాజు వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 15 టీమ్‌లు పాల్గొన్నాయి. సంస్థ కార్యదర్శి బి.నాగేశ్వరరావు, సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి వివేకానంద జయంతి సందర్భంగా అందజేయనున్నట్లు తెలిపారు.

బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

'సాండిపూడి' విద్యార్థుల ప్రతిభ

మందస: మండలంలోని నారాయణపురం హైస్కూల్లో శనివారం నిర్వహించి జిల్లాస్థాయి టాలెంట్ టెస్టు పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఇదే మండలానికి చెందిన సాండిపూడి హైస్కూల్ చెందిన విద్యార్థులు రాణించారు. బాడ శ్రీజ, మట్ట హర్ష, జె.నిహారిక, వై.రూప్ కుమార్‌లు జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి సత్తాచాటు కున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుందర్ సాల్మన్ మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా గొప్ప విజయాన్ని అందించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

జాతర సజావుగా జరిగేనా?

ఆలయ ఆవరణలో అనధికారికంగా ఏర్పాటు చేసిన జైంట్‌వీల్

అనధికార ఆశీల వసూళ్లకు ప్రయత్నం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస వద్ద నున్న సంఘమేశ్వర స్వామి కొండ దిగువున ప్రతిఏటా మూడురోజుల పాటు పండుగ, కనుమ, ముక్కనుమ పర్వదినాల నాడు జరిగే సంగమేశ్వర స్వామి జాతర ఈ ఏడాది సజావుగా జరిగేనా అని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. గడచిన 20 ఏళ్లుగా కొండ దిగువన జరిగే జాతరను అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని సంగమేశ్వర స్వామి కొండకు వచ్చే భక్తులకు దాతలను సంప్రదించి ప్రతి సోమవారం ప్రసాదాలను ఏర్పాటు చేస్తూ గుడి పరిసర ప్రాంతాలను బాగు చేస్తూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ కాలం వెళ్ళదీస్తున్నాడు. అయితే ఈ ఏడాది గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సంగమేశ్వర స్వామి కొండ దిగువున జరిగే జాతర తమ ఆధీనంలో జరగాలని ప్రయత్నాలు చేస్తుండడంతో ఇరువర్గాల మధ్య ఎక్కడ గొడవలు జరుగుతాయోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కొండ దిగువన యాత్ర జరిగే మూడు రోజుల పాటు తిను బండారాలు, బొమ్మలు ఇలా పలు రకాల దుకాణాలు నిర్వహిస్తూ చాలా మంది చిరు వర్తకులు తమ జీవనాన్ని సాగిస్తూ ఉండేవారు. చిరు వ్యాపారులకు సైకత శిల్పి గేదెల హరికృష్ణ మంచినీళ్లు, వసతి తదితర ఏర్పాట్లు చేస్తూ ఉండేవాడు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సంగమేశ్వర స్వామి కొండ దిగువున ఉన్న చెరువు చుట్టూ బాగా పెరిగిన ముళ్ల పొదలను తొలగిస్తుంటే అధికారులకు ఫిర్యాదు చేసి ఆ పనిని నిలుపుదల చేశారని, ప్రతి పనికి ఆటంకం కలిగించి అటు భక్తులకు ఇటు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సైకత శిల్పి హరికృష్ణ వాపోతున్నాడు. సంఘమేశ్వర స్వామి గుడి ఎండోమెంట్ పరిధిలో ఉన్నప్పటికీ దేవదాయశాఖ అధికారులు పట్టించు కోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి జాతర సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనధికార ఆశీల వసూళ్లకు ప్రయత్నం

సంగమేశ్వర స్వామి జాతరకు ఇప్పటివరకు ఆశీల వసూలు చేయడం తెలియదని మండలానికి చెందిన పలువురు చెబుతున్నారు. గాజుల కొల్లివలసకు చెందిన కొంతమంది వ్యక్తులు ఈ ఆశీల వసూళ్లు కొత్తగా తెర మీదకు తెస్తున్నారని, వర్తకుల వద్ద ఆశీలను వసూలు చేసి దోచుకోవాలని ప్రయత్నిస్తున్నారని కొంతమంది చెబుతుండగా మరికొంత మంది ఆశీలు వసూలు చేయగా వచ్చిన సొమ్ముతో ఆలయ అభివృద్ధి చేస్తారని చెబుతున్నారు. ఏది ఏమైనాప్పటికీ ఆశీల వసూళ్లపై అధికారుల ఆమోద ముద్ర లేకుండా అనధికార వ్యక్తులు ఆశీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా జెయింట్ వీల్

జాతరలో ప్రతి ఏడాది మండాకురిటికి చెందిన ఓ వ్యక్తి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రతి ఏడాది జెయింట్ వీల్ ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు హాజరవుతుంటారు. ప్రమాదవశాత్తు ఏదైనా దుర్ఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జెయింట్ వీల్ నిర్వాహకులు పోలీసు, పంచాయతీ అనుమతి తీసుకోకు ండానే వారం రోజుల కిందట నుంచే జాతర వద్ద ఏర్పాట్లు చేసుకుంటు న్నారని సంబంధిత అధికారులు చూసి చూడ నట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెడుతున్నారు

ఒక సామాజిక తరగతికి చెందిన కొంతమంది జాతరను వారి చెప్పు చేతల్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వారి వర్గానికి చెందిన వ్యక్తులకు మేలు కలిగేలా వ్యవహారిస్తున్నారు. వేసు లుబాటు ప్రక్రియలో భాగంగా తమ వారికి సహకరిస్తూ, మిగతావారికి చిరు వ్యాపారులకు జాతరలో స్థానం లేకుండా చేస్తున్నారు. అలాగే కమిటీని కూడా తమవారికే ఎంపిక చేసేలా పావులు కదుపుతున్నారు. గత 20 ఏళ్లుగా ఆశీలు లేకపోయినా అనధికారికంగా దండుకోడానికి సిద్ధమవుతున్నారు.

– గేదెల హరికష్ణ, సైకతశిల్పి, గాజులకొల్లివలస

ప్లాట్ ఫారం టిక్కెట్ అడ్డుకున్న టిక్కెట్ కలెక్టర్లు

ప్లాట్‌ఫారం టిక్కెట్ కోసం వాగ్వివాదం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో రోజుకొక నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులతో పాటు, వారితో వచ్చిన బంధువులతో ప్లాట్‌ఫారం టిక్కెట్‌పై టిక్కెట్ కలెక్టర్లు వాగ్వివాదానికి దిగారు. శనివారం ఒక్కసారిగా టిక్కెట్ కలెక్టర్ ఇద్దరు ప్లాట్ ఫారం టిక్కెట్ లేనిదే లోపలకు ప్రవేశం లేదని భీష్మించుకున్నారు. ఎప్పుడూ లేనిది ఒక్కసారిగా ప్లాట్ ఫారం టిక్కెట్ అడగడంతో ప్రయాణికులతో వచ్చిన కుటుంబ సభ్యులు వాగ్వివాదం చేశారు. ఇచ్ఛాపురం లాంటి చిన్న స్టేషన్‌లో కొత్తగా ప్లాట్ ఫారం టిక్కెట్ తీస్తేనే లోపలకి ప్రవేశ మంటూ అడ్డు చెప్పడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. రైలులో టిక్కెట్ లేకుండా ప్రయాణించిన వారిని విడిచిపెట్టి స్టేషన్‌లో దించడానికి వచ్చేవారిని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

బకాయిలు చెల్లించాలని వినతి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని అంబేద్కర్ గురుకులాల కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి సుధారాణి, మంజు, ఐఎఫ్‌టియు నాయకులు గణేష్ డిమాండ్ చేశారు. శనివారం గురుకులాల కో-ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గురుకులాల్లో ఏడేళ్లుగా పనిచేస్తున్నా వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని, ప్రభుత్వం జిఒ 549 ఇచ్చినప్పటికీ రూ.16 వేలు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. అనంతరం జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయ సూపరింటిండెంట్ రమణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కృష్ణవేణి, సుజాత, విజయకుమారి, కుమారి, పద్మా, రవణమ్మ, గౌరమ్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకల లచ్చమ్మ జాతర

బూర్జ: మండల కేంద్రంలో చాకల లచ్చమ్మ పేరంటాల జాతర భోగి, సంక్రాంతి, కనుమ మూడురోజుల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు గుడ్ల నవనీతం తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 1965లో నిర్మాణం చేపట్టి ప్రతిఏటా జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మండలంతో పాటు చుట్టుపక్క మండలాల ప్రజలు తరలివస్తారన్నారు.

జూదమాడితే కఠిన చర్యలు

కొత్తూరు : సంక్రాంతి పండగను పురస్కరించుకొని పేకాట, కోడి పందాలు, చట్ట వ్యతిరేకమైన ఆటలు ఆడితే చర్యలు తీసుకుంటామని సిఐ చింతాడ ప్రసాదరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారు బంగారం, డబ్బులను వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు.

తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే గౌతు శిరీష

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకు తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని హట్కో కాలనీ, శాంతి నగర్ ప్రాంతాల్లో ఉద్దాన తాగునీటి ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సంబంధించిన పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చాలా ప్రాంతాల్లో తాగునీరు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ పరిస్థితి లేకుండా మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సమయంలో తాగునీరు కోసం ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో శంకుస్థాపన చేసిన పనులను పూర్తి చేసి మరలా తానే నీటి సరఫరా కార్యక్రమానికి వస్తానని చెప్పారు. అనంతరం పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్, కమిషనర్ ఎన్.రామారావు, డిఇ కనకరాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత జెస్సి ఈవెంట్స్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 21వ వార్డు రావికంటి పేటలో రెండురోజులగా వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ పోటీల్లో విజేతగా గొల్ల మామిడిపల్లికి చెందిన జెస్సి ఈవెంట్స్ ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో 23 జట్లు పాల్గొన్నాయి. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు రిఫరీ బోర్డ్ చైర్మన్ తిరుపతిరావు, కబడ్డీ బోర్డ్ చైర్మన్ శ్రీనివాసరావు సమక్షంలో ఇన్విటేషన్ కం నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో సింగుపురం టీమ్ ద్వితీయ స్థానం సాధించగా కొర్లకోట కబడ్డీ టీమ్ తృతీయ స్థానం, పాలకొండ టీమ్ నాలుగో స్థానం పొందింది. ప్రథమ స్థానం సాధించిన గొల్ల మామిడిపల్లి జెస్సి టీమ్‌కు రూ.50 వేలు నగదు, జ్ఞాపికను చింతాడ రవికుమార్ చేతులమీదుగా అందజేశారు. అలాగే ద్వితీయ స్థానం పొందిన సింగపురం టీమ్‌కు రూ.30 వేలు నగదు, జ్ఞాపికను, తృతీయ స్థానం సాధించిన కొర్లకోట టీమ్‌కు రూ.30 వేలు నగదు, నాలుగోస్థానం సాధించిన పాలకొండ టీమ్‌కు రూ.20 వేలు నగదు, జ్ఞాపికలను అందజేశారు.

జెస్సి టీమ్‌కు ట్రోఫీని అందజేస్తున్న రవికుమార్

రంగవల్లుల విజేతకు రూ.10 వేలు

రంగవల్లుల పోటీల్లో ప్రథమ స్థానం పొందిన రావికంటి పేటకు చెందిన టి. సుధారాణికి రూ.10 వేలు నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేత రావి కంటి పేటకు చెందిన బి.గౌతమి టీమ్‌కు రూ.5 వేలు నగదు బహుమతి, తృతీయస్థానం సాధించిన వంజంగికి చెందిన మహేశ్వరి టీమ్‌కు రూ.2 వేలు నగదు బహుమతిని రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, సురవరపు నాగేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, మామిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

హెచ్ఐవిపై అవగాహన

పొందూరు: మండలంలోని తండ్యాంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు శనివారం ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ సిఎఫ్ఐ లింక్ వర్కర్ స్కీం గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి నిర్మూలనతో పాటు వివిధ సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదన్నారు. సర్పంచ్ ప్రతినిధి కె.భాస్కరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. ఐసిటిసి కౌన్సులర్ నాగవల్లి సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ టి.ఆదినారాయణ, సిఎల్‌డబ్ల్యూ ఉషారాణి, గణేష్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

శ్రీకాకుళం అర్బన్ : గోకులాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో రోజురోజుకీ అంతరించిపోతున్న గోవులను ప్రతిఒక్కరూ బాధ్యతగా సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని నందికొండ కాలనీలో ఉపాధిహామీలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న గోవులకు ఎమ్మెల్యే రవికుమార్ పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల పాలనలో రాష్ట్రంలో 12,500 గోకులం షెడ్లను నిర్మించడమే కాకుండా మరో 20 వేల గోకులం షెడ్లను నిర్మించడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు ఇంటి ముందు ఉండే గోవులు ప్రస్తుతం పెద్దగా కనిపించడం లేదని మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి సిఎం చంద్రబాబు నాయుడు గోవులను సంరక్షించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండ రామారావు, దవళ సింహాచలం, ఇలాకుల ప్రభాకర్, కొమనాపల్లి రవికుమార్, శివ్వాల సూర్యనారాయణ, అంబల్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, పేడాడ మణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పల్లెల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న గోకులాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బైరి గ్రామంలో మూడు మినీ గోకులాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు ఎపిఒ సీతారాం, టి.ఎ.రత్నాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందనిఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి విశ్వక్షేన్ అన్నారు. మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలసలో మినీగోకులాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అప్పలకొండ, సంతోష్, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి వడ్డాది శ్రీను, దాసరి బలరాం, వీరమహిళ స్వప్న, కాకర్ల బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు ముప్పిడి సురేష్ అన్నారు. అప్పాపురంలో రైతు గుణాన రమణకు ప్రభుత్వం మంజూరు చేసిన గోశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అప్పాపురం మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్, టిఎ రమణమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యనారాయణ, టిడిపి నాయకులు బాసిన దాలిరాజు, లంకలపల్లి శ్రీనువాసరావు, పళ్లంట్ల చిట్టిబాబు, కోలా నారాయణరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా ముందుకెళ్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కేశరాపురంలో మినీగోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులు గోశాలలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం గుర్తించిన ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా ఒక్కో గోశాల నిర్మాణానికి రూ.1.50 లక్షలు కేయించిందన్నారు. పాడి రైతులు గోశాలలు ఏర్పాటు చేసుకుని పాడి పశువులను పెంచుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడి కంచరాన రాజగోపాల్, పశుసంవర్ధక ఎడి మంచు మనోహర్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎపిఒ రవి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపి భైరిసింగి లక్ష్మీనారాయణ, ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలాస : మండలంలోని కైజోలలో మినీగోశాలను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, ఎపిడి శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి పోతనపల్లి చంద్రశేఖర్, ఎంపిడిఒ వసంతకుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, ఎపిఒ శంకరరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

రణస్థలం : గోకులాన్ని ప్రారంభిస్తున్న విశ్వక్షేన్

సరుబుజ్జిలి : గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

లావేరు : గోశాలను ప్రారంభిస్తున్న సురేష్

శివశంకర్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సన్యాసప్పడు (ఫైల్)

ఐఎఎస్ అధికారి, ప్రస్తుత ఆరోగ్యశ్రీ తెలంగాణ రాష్ట్రం ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఐఎఎస్ అధికారి లోతేటి శివశంకర్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి సన్యాసప్పుడు (77) శనివారం సాయంత్రం ధర్మవరంలో కనుమూశారు. సన్యాసప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేశారు. ఆయన కుమారుడైన శివశంకర్ శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒగా, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత పలనాడు జిల్లాకు తొలి కలెక్టర్‌గా, తరువాత కడపజిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ తెలంగాణ రాష్ట్రం ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. సన్యాసప్పడు అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు ధర్మవరంలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

యువకునిపై దాడి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక గౌరీ శంకర్ థియేటర్‌లో సినిమా హీరో రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ చిత్రం ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం రాత్రి రెండో ఆటలో పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడకు చెందిన గుడాల నాగరాజు సినిమా చూస్తున్నాడు. సీటు ముందు హిరమండలానికి చెందిన పడాల రోహిత్, పడాల మనోహర్ అడ్డుగా నిల్చొన్నారు. సినిమా కనిపించడం లేదని, కూర్చోవాలని నాగరాజు కోరారు. దీంతో వారు కోపోద్రిక్తులై నాగరాజుతో పిడుగులతో గుద్ది గాయ పరిచారు. నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం పట్టివేత

కొత్తూరు : మండల కేంద్రం నుంచి కలిగాంకు చెందిన మొదలవలస పాపారావు మద్యం బాటిళ్లను శనివారం తరలిస్తున్నారు. మార్గంమధ్యలో పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి- పాతపట్నం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో నాటు సారా తయారీ, అమ్మకాలపై శ్రీకాకుళం డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జీరావు, ఒడి రాష్ట్ర గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు తిరుమలనాయుడు, డి.వి.జి.రాజు, బి.భూషతిభూషణ్‌లు సంయుక్తంగా శనివారం దాడులు నిర్వహించారు. ఒడిశాలోని సింగుపూర్, శిరడా, గురిసింగిగూడ, తమిలీగూడ ఆంధ్రాలోని నేరేడిగూడ గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 7400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 1140 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు దర్యాప్తు స్తున్నారు. ఈ దాడుల్లో పాతపట్నం ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు, కొత్తూరు, ఆమదాలవలస, నరసన్నపేట సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని యరగాంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి నాయకుడు గురువు తిరుమలరావు కోరారు. గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఈనెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు.

నివాళ్లర్పిస్తున్న సన్యాసిరావు తదితరులు

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

బూర్జ: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు సూచించారు. శనివారం పెద్దపేట ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ముందస్తుగా నిర్వహించారు. స్వామి వివేకానంద తన జీవన శైలిని ప్రపంచానికి ఎన్నో బోధనలను అందించారన్నారు. అలాగే యువతకు ప్రపంచానికి ధ్యానం వలన కలిగే లాభాలను వివరించారన్నారు. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రాంగణంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిఇఒ బి.శంకరరావు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

కవిటి: నేటి యువతకు వివేకానంద ఆదర్శమని ఎస్‌విజి విద్యా సంస్థల కరస్పాండెంట్ బెందాలం కింగ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఎస్‌విజి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి వివాకానంద వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన ఖ్యాతిని కొనియాడారు. కళాశాల అధ్యాపక బందం, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 31లోగా ఇళ్లు పూర్తి

పలాస: మార్చి 31లోగా ఇళ్ల పూర్తికి చర్యలు చేపట్టాలని గృహనిర్మాణశాఖ సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ సిహెచ్.మల్లేశ్వరరావు సూచించారు. పలాసలోని రెడ్డికవీధిలో శనివారం నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మార్చి 31లోగా పూర్తి చేయకుంటే బిల్లులు నిలిచిపోతాయని అన్నారు. కొత్తగా ఇళ్ల నిర్మాణాలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పి శ్రీదేవి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం సాక్షి రిపోర్టర్ గంగి నాగరాజు పెద్దనాన్న సత్తిరాజు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాని ఎచ్చెర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పరామర్శించారు. అలాగే వల్లభరావుపేటలో కార్యదర్శి కెల్ల రామకృష్ణ తండ్రి కెల్ల సోములు ఇటీవల స్వర్గస్థులైన విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈయనతో పాటు మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, ప్రదీప్, గౌరి శంకర్, గంగి హరి, గురాన చిరంజీవి, సత్యన్నారాయణ, గడి రమణ, కీర్తి మంగ, పాలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుమ్మాడం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవల పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రూ.25 లక్షల నిధులు మంజూరు చేయడంతో గుమ్మడం, వాళ్లేపేట గ్రామాల్లో టిడిపి నాయకులు మజ్జి రామమూర్తి, ముప్పుడి దుర్గారావు, వాళ్లే రమణ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నయి. వాళ్లేపేటలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రామమూర్తి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో అభివృద్ధికి నోచుకోక గ్రామాలు భ్రష్టు పట్టాయని, కూటమి ప్రభుత్వం డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో పల్లెలు ప్రగతిపదం వైపు దూసుకుపోతున్నయన్నారు.

ఓబన్న జయంతి

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపల్ కార్యాలయంలో శనివారం మొట్టమొదటి స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, మేనేజర్ దేవరపల్లి ప్రభాకరరావు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంతకుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేము సైతం...

కోటబొమ్మాళి: చిన్ననాటి నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండాలనే యోచనతో మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 5వ తరగతి విద్యార్థులు కవిత, కుమారి, జ్యోత్స్నలు శనివారం పూర్వీకలు దురలవాట్లు వద్దు అంటూ గీతాన్ని ఆలపించారు. వీరు మాదక ద్రవ్యాలు, ఈగల్ బృందం, 1972లపై అవగాహన కల్పిస్తూ తమ బాధ్యతను చాటుకున్నారు. చెప్పవే చెల్లమ్మ అంటూ సాగే ఈ పాట అదే పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖరావు రచించి, స్వరకల్పన చేశారు. చిన్ననాటి నుండే ఇటువంటి బాధ్యతాయుత కార్యక్రమాలు చేపట్టడంతో పలువురు హర్షించారు.

విస్తృత తనిఖీలు

ఇచ్ఛాపురం : పట్టణంలో ప్రధాన కూడలి కూడలి, రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాలు విక్రయాలపై నార్కోటిక్ డాగ్ తనిఖీలు శనివారం నిర్వహించారు. మత్తు పదార్థాలు నిల్వలపై తనిఖీలు చేశారు. సిఐ మీసాల చిన్నం నాయడు ఆధ్వర్యాన ఎస్ఐ శ్రీనివాస పోలీస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా గృహాలు విడిచి దూర ప్రయాణాలు చేస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి సెలవుల్లో పిల్లలకు ఆటవిడుపుగా ఉండేందుకు క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో క్లబ్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఈ వేడుకలను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. బోగి మంటలు, ముగ్గుల పోటీలు, గాలి పటాల తయారీ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, క్లబ్ వ్యవస్థాపకులు చింతాడ కృష్ణారావు, చింతాడ రామారావు, సిహెచ్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పలాస: కాశీబుగ్గ ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో శనివారం ఘనంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు భోగి మంటలు వేసి, ముగ్గుల పోటీలు, గాలిపటం ఎగురవేశారు. భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టత కోసం తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో హంగామా చేశారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అడవైజర్ నారాయణరావు, ఖగేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి డిపో ఆవరణలో కొత్తగా మంజూరైన రెండు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ దేశంలోనే ఆర్‌టిసి బస్సు సర్వీసులు మంచి సేవలు అందిసున్నాయని అన్నారు. సంక్రాంతి వేళ ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి కొత్తగా బస్సులు వేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నష్టాల్లో ఉన్న ఆర్‌టిసి సంస్థను లాభాల బాటలోకి తీసుకువెళ్లడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం వరకూ తిరుగాడే ఈ బస్సు సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, డిఎం ఆర్.సీతారాంనాయుడు, ఎడిఎం ఆర్.సంతోష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, టంకాల రవిశంకరుప్తా, జోగ మల్లి, కొరికాన శంకర్, కార్మిక సంఘ నాయకులు పి.వాలి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

'జైహింద్' ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

ప్రణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అండగా నిలిచి జైహింద్ సేవా ఫౌండేషన్ తన ఉదారత చాటుకుంది. కన్నుపుట్టుగకు చెందిన వెంకటేష్ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో విశాఖపట్నం గీతం ఆస్పత్రిలో ప్రణాపాస్థితిలో చికిత్స పొందుతున్నాడు. రోజుకు రూ.40 వేలు చొప్పున రూ.4 లక్షల ఖర్చువుతుందని వైద్యులు తెలిపారు. దీంతో దిక్కు తోచనిస్థితిలో ఉన్న వెంకటేష్ కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న జైహింద్ సేవా ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆస్పత్రికి చేరుకున్నారు. వెంకటేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉండమని చెప్పారు. తక్షణ సాయంగా రూ.15 వేలు అందించారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ట్రూ హేండ్స్ ఫౌండేషన్ ఔదార్యం

కృష్ణంరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

కవిటి: ట్రూ హేండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నర్తు కృష్ణంరాజు ఓదార్యం చాటుకున్నారు. మండలంలోని మాణిక్యపురం పిహెచ్‌సిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం గమనించి ట్రూ హేండ్స్ ఫౌండేషన్ తరపున సమకూర్చారు. శనివారం గ్రామానికి చేరుకుని 10 మంచాలు, పది పరుపులు, 10 తలగడలు, 10 స్టాండ్లు బహుకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ట్రూ హేండ్స్ ఫౌండేషన్ లక్ష్యమే సమాజ సేవని అన్నారు. అనంతరం గ్రామం తరపున డాక్టర్ కృష్ణంరాజుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు సురేష్, లతాశ్రీ, ఎం.భాస్కరరావు, ధనలక్ష్మి, ఇచ్ఛాపురం హెచ్‌సి రామారావు, సర్పంచ్ లలితా సాహు, పిఎసిఎస్ మజీ అధ్యక్షుడు దేవరాజు సాహు, ఎంపిటిసి సత్యవతి, మాజీ ఎంపిపి పి.తిలక్ పాల్గొన్నారు.

నెలవంకలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంకలో భారతీయ విద్యా కేంద్రం ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 80 మంది పాల్గొన్న ఈ పోటీల్లో డి.కావ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, ఎన్.గీత, ఎన్.గౌతమి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా బివికె కరస్పాండెంట్ కృష్ణారావు, చిరంజీవిరెడ్డి, నీలపు దేవరాజు మాట్లాడుతూ గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. బల్లెడ శరణ్య, పాతిన రాజేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఈ పోటీల్లో ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్, బల్లెడ యజ్ఞానంద్, పిరియా బాబ్జీరావు, పాఠశాల సిబ్బంది శిరీష, సుహాసిని, కృష్ణకుమార్, మాదికమ్మ, రాజేశ్వరి, జ్యోతి, లక్ష్మి, అశోక్, ఝాన్సీ, భార్గవి, అంజలి పాల్గొన్నారు.

విజేతలతో పాఠశాల సిబ్బంది

పరామర్శిస్తున్న సంతోష్‌పండా

జనసేన నాయకుల పరామర్శ

మందస: మండలంలోని లొద్దభద్రకు చెందిన జన సైనికులు మల్లా అనిల్, మల్లా సాయిప్రశాంత్ తండ్రి గణేష్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సాయి ప్రశాంత్ ద్విచక్ర వాహన దెబ్బతిందని, జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో పార్టీ బీమా విభాగానికి తెలియ జేస్తానని తెలిపారు. ఈయనతో పాటు నాయకులు బాలకృష్ణ, మేడిశెట్టి నరసింహమూర్తి, బంగారు కేదా ర్నాథ్, దువ్వాడ అనిల్, రత్నాల దిలీప్, రోథియా చక్రి ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి

పాతపట్నం : మండలంలోని గ్రామాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండగలు నిర్వహించుకోవానలి సిఐ వి.రామారావు ఒక ప్రకటనలో సూచించారు. తమ విలువైన వస్తువులను, నగదును, బంగార వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. పేకాట, కోడిపందాలు, డొక్కాటలు వంటివి ఎవరూ నిర్వహించరాదన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించారు. హెల్మెంట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు., మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న రాజేంద్రప్రసాద్

డైరీ ఆవిష్కరణ

సోంపేట : బిసి సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర బిసి లీగల్ సెల్ సంయుక్తంగా తయారు చేసిన డైరీని శనివారం వైద్యులు రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరు మాట్లాడుతూ బిసిల హక్కుల కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో అందరికీ ఉపయోగంగా ఈ డైరీని తయారు చేసినట్లు తెలిపారు. పి.అరుణ్‌కుమార్, బి.లక్ష్మీనారాయణ, ఆర్.తిమ్మరాజు, ఆర్.సంజీవరెడ్డి, టి. కుమారస్వామి, లక్ష్మీనారాయణ, ఆర్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

సాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లాలోని రైతులు తమ పంట పొలాలకు సాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. పర్లాకిమిడి పట్టణంలోని రాజుకోటకు సమీపాన సీతసాగరం, గుసాని సమితిలోని కొర్సండ వద్ద ఉన్న గజపతి సాగరం, పర్లాకిమిడి పట్టణానికి ఆనుకొని ఉన్న రామ సాగరం, కర్ణిభద్ర రెవెన్యూ, గోర్ని పంచాయతీ పరిధిలోని లక్ష్మిసాగరం, రంప, లావణ్యకోట పంచాయతీల పరిధిలో ఉన్న రాధాసాగరం, దోనూరు, పెద కొత్తూరు పరిధిలోని కృష్ణ సాగరం, కాశీనగర్ పట్టణానికి సమీపాన ఉన్న కృష్ణచంద్ర గజపతి సాగరం, గజపతి జిల్లాలోని ముఖ్యంగా గుసాని, రాయగడ, కాశీనగర్, గుమ్మా సమితిలోని కొన్ని వేల ఎకరాలకు సాగునీటి ఆధారం. కానీ, ప్రస్తుత ఆయా చెరువులో ఎటు వైపు నుంచి చూసినా చుక్క నీరు కనిపించడం లేదు. ఈ చెరువుల్లోని కొంత భాగాలను ఆక్రమణలకు గురయ్యాయి. కాశీనగర్ సమితిలో రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన మెగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు బుదురా, గొరిబంద పంచాయతీలకు 30 శాతం, ఖండవ పంచాయతీకి 50 శాతం మాత్రమే నీరు అందినట్లు సమాచారం.